కథావేదిక

# చిన్నారి మనసులు

## లలిత శిష్ట్లా

రూప ఆరో క్లాసు చదువుతోంది. మంచి తెలివైన పిల్ల. చదువులోను, ఆటల్లోను చురుకుగా ఉంటుంది.

అయితే కొన్ని రోజులుగా రూప చాల నిర్లిప్తంగా ఉంటోంది. ఏపని మీద శ్రద్ధలేదు. తల్లి ఏం చెప్పినా విసుక్కుంటోంది.

అప్పుడప్పుడు తల్లీకూతుళ్ళ మధ్య వాదన జరుగుతోంది. రూప చెల్లెలు దీపకి ఆరేళ్ళు. రెండోక్లాసు చదువుతోంది. అక్కకి, అమ్మకి మధ్య జరిగే పోరాటానికి, సమిధి కొంతవరకూ దీప కూడా!

ఆరోజు రేణుక త్వరగా ఆఫీసు నుంచి వచ్చింది. అప్పుడే స్కూల్ నుంచి వచ్చిన రూప, దీప, కనీసం షూస్ అయినా విప్పకుండా కుర్చీల్లో బాగ్స్ పడేసి, టి.వి. స్విచ్ ఆన్ చేశారు.

''త్వరగా డ్రెస్ ఛేంజ్ చేసుకుని, పాలు తాగండి. అయినా వస్తూనే టి.వి. పెట్టొద్దని ఎన్నిసార్లు చెప్పాను? అంటే రోజూ, నేను లేకపోతే ఇలాగే చేస్తున్నారన్నమాట'' గట్టిగా కేకలు వేస్తూ టి.వి. స్విచ్ ఆఫ్ చేసింది, రేణుక.

ఇద్దరు పిల్లలు బిక్కమొహాలు వేసుకుని, బట్టలు మార్చుకోవడానికి ఉపక్రమించారు.

పిల్లలిద్దరికీ హార్లిక్స్ కలిపింది రేణుక. రూప, దీప ఇద్దరు బుద్ధిమంతుల్లా డైనింగ్ టేబిల్ దగ్గరకు వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు.

''రూపా! ఈరోజు నీకు వీణక్లాసు ఉంది. మాథ్స్ ట్యూషన్ అయ్యాక, అట్నించి అటే వీణ క్లాసుకు వెళ్ళు. వచ్చేటపుడు నేను తీసుకుని వస్తాను'' హార్లిక్స్ తాగుతున్న రూపతో చెప్పింది రేణుకు. రూపకి ఏదో పైకి చెప్పలేని బాధ. స్కూల్, ట్యూషన్, వీణక్లాసు ఇవే లోకమా? అన్న ప్రశ్న ఆ చిన్నారి మనసును అనునిత్యం బాధిస్తుంది.

వీణక్లాసుకి వెళ్ళాలనిలేదు. ఆ విషయం చెపితే తల్లి తిట్లవర్షం కురిపిస్తుంది. మాథ్స్ ట్యూషన్ మిస్ చేస్తే సార్ సవాలక్ష శాపనార్థాలు పెడతాడు.

అసలు వీణ నేర్చుకోవడమే మానేద్దామంటే, వీణ టీచర్ 'నువ్వు బాగా వాయిస్తున్నావు. గొప్ప విధ్వాంసురాలివి కావాలి. నాపేరు నిలబెట్టాలి' అంటుంది. తనకేమో అసలు ఇష్టంలేదు.

ఎలాగైనా ఆరోజు తన నిర్ణయం గట్టిగా చెప్పాలనుకుంది. ''మమ్మీ! నేను వీణ క్లాసుకి వెళ్ళను. అసలు నేర్చుకోను'' ఎటో చూస్తూ చెప్పింది.

దీపకి పాలు తాగిస్తున్న రేణుక, గ్లాసు టేబుల్ మీద పెట్టి ''ఏం ఎందుకు నేర్చుకోవు. బోల్డు డబ్బుపోసి నేర్పిస్తుంటే నేర్చుకోడానికి నెప్పా?'' విసుగ్గా అంది.

''నాకు బాగా వేళ్ళు నెప్పెడుతున్నాయి. హోంవర్క్ కూడా చాలా ఉంటోంది. మాథ్స్ ట్యూషన్‌కి మానేస్తే సార్ తిడతాడు.'' నిర్భయంగా, నిజాయితీగా చెప్పింది.

''అన్నీ అబద్ధాలే! నీ ఏజ్ పిల్లలు, ఎంతమంది ఎన్ని నేర్చుకోవటంలేదు. ఏదో ఒక వంక చెప్పి మానేస్తే దెబ్బలు పడతాయి. తెలిసిందా?'' బెదిరించింది రేణుక.

రూపకి ఎక్కడలేని ఉక్రోషం వచ్చింది. తన ముందు ఇంకెవరినైనా పొగిడితే ఆ పిల్ల అస్సలు ఓర్చుకోలేదు. తల్లి బెదిరింపులకి ఏడుస్తూ గదిలోకి వెళ్ళి, కోపంగా తలుపులు దఢాలున వేసి గడియ పెట్టుకుంది, ఆ పదేళ్ళ పసి పిల్ల.

కూతురి మొండితనం, ఎదిరించటం రేణుకలో బాధతోపాటు మితిమీరిన కోపం కలిగిస్తోంది. ఫలితంగా ఆమెకు రోజు రోజుకి మనస్థిమితం లేకుండా పోతోంది.

'ఈరోజు నెమ్మదిగా నచ్చచెప్పి దారిలోకి తేవాలి' అనుకుంది. దీపకి పాలు తాగించి, నెమ్మదిగా వంట ప్రయత్నంలో పడింది.

• • •

''ట్రింగ్.. ట్రింగ్'' హాల్లో ఫోన్ రింగ్ అవుతోంది. హాల్లో కూర్చుని హోమ్‌వర్క్ చేసుకుంటున్న పిల్లలు తీస్తారని రేణుక ఊరుకుంది. రూప ఓసారి ఫోన్ వంక చూసి తన పనిలో నిమగ్నమైపోయింది. దీప, తల్లి కోపంగా ఉందన్న భయంతో తనూ ఫోన్ దగ్గరకు వెళ్ళలేదు.

''రూపా! ఏంటి చెముడా? ఫోన్ రింగ్ అవుతుంటే తీయడానికి ఏం రోగం'' విసుక్కుంటూ ఫోన్ లిఫ్ట్ చేసింది.

''హలో రేణుకా హియర్''

''నేను గాయత్రిని. ఇవాళ మీ రూప వీణ క్లాసు రాలేదేం?'' అవతలి కంఠం పలికింది.

''హోంవర్క్ ఎక్కువగా వుంది. అందుకే పంపలేదు'' అబద్ధం చెప్పింది రేణుక.

''అలా అయితే కష్టం రేణుకా. మీరిలా చీటికి మాటికి మాన్పిస్తే తనకి ఇంట్రెస్ట్ పోతుంది. అలా బ్రేక్ చేయటం అలవాటు చేయకండి. మీ అమ్మాయి చాలా చక్కగా వీణ వాయిస్తుంది'' అంది గాయత్రి.

''ఏం చేయనండి? నాకు మా అమ్మాయి నేర్చుకోవాలని చాలా ఇంట్రెస్ట్. ఎందుకో ఈమధ్య అది మరీ మొండిగా తయారైంది. ఏం చెప్పినా వినదు. ఎదిరిస్తోంది. ఏం చేయాలో నాకసలు అర్థం కావటంలేదు.''

''పిల్లలకు కూడా వాళ్ళ ఇష్టాయిష్టాలు ఉంటాయి. అపుడపుడు మనం కూడా వాటికి విలువ ఇస్తూ ఉంటే, వాళ్ళు మన మాట వింటారు. లేకపోతే వాళ్ళ దృష్టిలో తల్లిదండ్రులు శత్రువులే.''

''నేను అలా అనుకుంటూనే ఉంటాను కానీ ఆచరించలేకపోతున్నాను. మా వారు మరీ స్ట్రిక్టు. ఆడపిల్ల అనైనా చూడకుండా కోపం వస్తే దబ దబా బాదేస్తారు.'' నిస్సహాయంగా చెప్పింది రేణుక.

''మీరింకేం చెప్పకండి. రేపు మీ రూపని తీసుకురండి. నేను కౌన్సిల్ చేస్తాను'' ఫోన్ డిస్కనెక్ట్ చేసింది గాయత్రి.

రూప చూపులు పుస్తకం మీద ఉన్నా, తల్లి మాటలు చెవులు రిక్కించి వింటోంది.

ఎప్పుడూ హోంవర్క్ చేయడానికి పేచీపెట్టే దీప కూడా పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది.

భర్త రఘురాం పెందరాడే వస్తే, రూప ట్యూషన్‌కి ఎందుకు వెళ్ళలేదని శివతాండవం చేస్తారు. ఆయన త్వరగా రాకపోతే బావుండునని రేణుక మనసులో అనుకుంది.

అయినదానికి, కానిదానికి పిల్లలతోపాటు తనని నిందిస్తాడు. భర్త ఆవేశం, కోపం, పిల్లల మొండితనంతో రేణుకకు మనశ్శాంతి లేకుండాపోతోంది.

• • •

మర్నాడు ఆఫీసు నుంచి రాగానే రూపకి, దీపకి చక్కగా డ్రెస్ చేసి గాయత్రి టీచరింటికి బయల్దేరింది రేణుక.

గాయత్రి టీచరంటే రూపకి ఇష్టం లేకపోలేదు, కానీ క్లాసు ఎగ్గొడితే మాత్రం బాగా కేకలేస్తుందని భయం.

రేణుక వెళ్ళేసరికి, మిగతా పిల్లలకు ఆరోజు క్లాసు పూర్తిచేసి పంపేసింది గాయత్రి.

''హాయ్ రూపా! ఏమిటి విశేషాలు? మీ స్కూల్లో జనవరి ట్వంటి సిక్స్త్‌కి ఏమన్నా కాంపిటేషన్స్ ఉన్నాయా?'' ఎంకరేజింగా, రూప భయం పోగొట్టాలని అడిగింది గాయత్రి.

''నిన్న ఎందుకు రాలేదని అడుగుతుందేమోనని భయపడ్డ రూప 'హమ్మయ్య' అనుకుంది. అందుకే హుషారుగా జవాబిచ్చింది.

''ఉన్నాయాంటీ, నాకు ఛెస్ ఆడటం ఇష్టం కదా! అందుకే ఆ గేమ్‌కి పేరిచ్చాను.''

రేణుక చాలా డిస్సప్పాయింట్ అయింది. వీణకి పేరి

స్తుందనుకుంటే, ఛెస్‌లో పేరిచ్చింది.

గాయత్రి అది గమనించి, 'మీరేం మాట్లాకండి' అని కళ్ళతోనే సంజ్ఞ చేసింది.

''ఓ.కే. వెరీగుడ్. సరే ఇవాళ కాసేపు మనం సరదాగా ఆడుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఎంజాయ్ చేద్దాం. సరేనా!'' నవ్వుతూ చెప్పింది గాయత్రి.

రూప కళ్ళు ఆనందంతో మెరిశాయి. వేయి దీపాల కాంతి ఆ చిన్నారి మోములో ప్రతిఫలించింది. అయినా తల్లి ఏమన్నా అంటుందా అని భయంగా రేణుక వంక చూసింది.

''సరే గాయత్రి, నేనలా బజారెళ్ళి కూరలు తెచ్చుకుంటాను. అంతదాకా పిల్లలిద్దరు ఇక్కడే ఉంటారు.''

బాగ్ తీసుకుని బయటికి వెళ్ళిపోయింది రేణుక. పిల్లలిద్దరిలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అసలు ఇలాంటి అందమైన సాయంత్రం ఎంజాయ్ చేసి ఎన్ని రోజులైందో అని రూప మనసు బయట లాన్‌లో పరుగుతీయటానికి ఉవ్విళ్ళూరుతోంది.

గాయత్రి వాళ్ళ ఉత్సాహం గమనించి, ఇద్దరిని ఇంటి ముందు భాగంలో ఉన్న లాన్‌లోకి తీసుకుని వెళ్ళింది.

సూర్యుడు తన ప్రతాపాన్ని చాలించి నెమ్మదిగా జారుకుంటున్నాడు. ఆకాశం సిందూర వర్ణానికి మారి ఎంతో అందంగా ఉంది. వాతావరణం చల్లదనాన్ని సంతరించుకుని, మనస్సుకి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

లాన్‌లో ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు గాయత్రి, రూప, దీప.

పిల్లలిద్దరి దృష్టి ఎదురుగా ఉన్న ఉయ్యాలపైనే ఉందని గాయత్రికి తెలుసు. నెమ్మదిగా వాళ్ళను మాటల్లోకి దింపింది.

• • •

''రూపా! ఈమధ్య నువ్వసలు క్లాసులో ఎటెంటివ్‌గా ఉండటం లేదుట. మీ క్లాస్ టీచర్ చెప్పింది'' చిన్న అబద్ధమాడింది గాయత్రి.

రూప ఏం మాట్లాడలేదు. తలదించుకుని కూర్చుంది. దీప అక్కవంక, గాయత్రి వంక మార్చి మార్చి చూస్తోంది.

''చెప్పు రూపా! నేనేమనను. నీకేవన్నా కష్టం అనిపిస్తే, ఎవరితోనన్నా చెపితే హాయిగా ఉంటుంది'' బుజ్జగించింది.

తనేమన్నా చెపితే మళ్ళీ తల్లికి చెప్తుందేమోనన్న భయం తాలుకూ నీలినీడలు, ఆమె కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

''చెప్పు రూపా! నీకేం భయంలేదు. నేనెవ్వరికి చెప్పను. ప్రామిస్'' రూప చేతిలో చేయి వేస్తూ చెప్పింది.

''నిజంగా ఎవరితోనూ చెప్పరా?'' అపనమ్మకంగా చూస్తూ అంది రూప.

రూపకి తన మనసేంటో, తన భావాలేంటో ఎవరితోనన్న చెప్పాలని ఉంటుంది. కానీ అపార్థం చేసుకుంటారేమోనని ఆ చిన్నారి భయంతో నోరు కట్టేసుకుంది. అందుకే ఈరోజు గాయత్రి టీచర్ ఆప్యాయంగా అడిగేసరికి ధైర్యం వచ్చింది.

''మరేమో! మా మమ్మీ ఆఫీసు నుంచి వచ్చేదాకా చెల్లిని చూడమంటుంది. అదేమో నే చెప్పిన మాట వినదు. ఎపుడైనా విసుగొచ్చి రెండు దెబ్బలు వేస్తే, మమ్మీకి చెప్పి తిట్టిస్తుంది'' దీప వంక కోపంగా చూస్తూ చెప్పింది రూప.

అక్క మాటలకు బుంగమూతి పెట్టి, వింటోంది దీప.

''మరి ట్యూషన్‌కి వెళితే బావుంటుందా?'' మాట మార్చింది గాయత్రి.

''లెక్కలు బాగా చేస్తే వెరీగుడ్ అంటారు, సార్. ఎపుడైనా సరిగ్గా అర్థంకాక తప్పుచేస్తే 'మొద్దువి, ఇంట్లో కూర్చుని అంట్లు తోముకో ఆడపిల్లవు కదా!' అని తిడతారు'' బాధగా చెప్పింది.

''ఇంకా!''

''అపుడేమో! బాయిస్ అంతా నవ్వుతారు. నాకేమో ఇన్సల్టింగ్‌గా ఉంటుంది. సార్‌ని చంపాలన్నంత కోపం వస్తుంది. ట్యూషన్ మానేస్తానంటే మా డాడీ కొడ్తారు.'' ఆవేశంగా చెప్పింది రూప.

''మరి ఈ విషయం డాడీకి చెప్పచ్చుగా!'' అంది గాయత్రి.

''హమ్మో! డాడీకి చెప్తే ఇంకేమన్నా ఉందా?'' గుండెల మీద చేయి వేసుకుని భయాన్ని ప్రదర్శించింది రూప.



''భయం దేనికి, మీ మమ్మీ, డాడీని నీ బాధ ఏంటో చెప్పి కన్విన్స్ చేయచ్చుగా.''

''వాళ్ళు నా మాట వినరాంటీ. ఎప్పుడూ చదువు, చదువు అని ఒకటే గోల. నాకు ఫిఫ్త్ రాంక్ వచ్చినా, ఫస్ట్ ఎందుకు రాలేదని తిడతారు. చెల్లి ట్వంటీఫిఫ్త్ ర్యాంక్ వచ్చినా ఏం అనరు.''

పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపుతున్న వ్యత్యాసాన్ని చక్కగా గమనించింది రూప. ఫలితంగా వారిపట్ల కోపం, ద్వేషం పెంచుకుంటోందని అర్థం అయింది గాయత్రికి.

''మరి పేరెంట్స్‌కి, పిల్లలు బాగా చదువుకోవాలని ఉంటుంది కదా, అందుకే అలా అంటారు. ఇందులో తప్పేంటి?''

''అయితే తిడతారా? నాకైతే ఒక్కొక్కసారి చచ్చిపోవాలనిపిస్తుంది'' కసిగా అంది రూప.

గాయత్రి చటుక్కున రూప నోరు మూసేసింది.

''తప్పమ్మా, చిన్నపిల్లలు అలా మాట్లాడకూడదు. పోనీ వీణక్లాసుకి ఎందుకు రావటంలేదు?'' డైవర్ట్ చేసింది గాయత్రి.



## సాక్ష్యం!

జడ్జి: నువ్వు ఆ కారును దొంగిలించడం చూశామని ఇరవైమంది సాక్షులు చెప్తున్నారు.

ఖైదీ: యువరానర్! నేను నలభైమందితో సాక్ష్యం వినిపిస్తాను మీకు, నేను దొంగతనం చేస్తూ ఉండగా చూళ్లేదని!

## నాప్‌కిన్!

ఒక పేరుపొందిన రెస్టారెంట్‌లోకి సుబ్బారావు వెళ్ళి ఓ టేబుల్ ముందుకూర్చుని, తన నాప్‌కిన్‌ను మెడ చుట్టూ కట్టుకున్నాడు. అది చూసిన మేనేజర్, సర్వారావును పిలిచి,

''ఇటువంటి పేరున్న హోటల్లో, మెడలో అలా నాప్‌కిన్ చుట్టుకో కూడదని అతనికి మర్యాదగా, ఎంతో తెలివిగా చెప్పు!'' అన్నాడు.

సర్వారావు, సుబ్రావ్ దగ్గరకు వెళ్లి, ''సార్! మీరు గెడ్డం చేయించుకొంటారా? క్రాపా?'' అని అడిగాడు.

వెంటనే సుబ్రావ్ మెడలో నాప్‌కిన్ తీసేశాడు!

- కొడిమెల

## శుభవార్త

డాక్టర్: ''నేను నీకొక శుభవార్త, చెడు వార్త తెచ్చాను.''


పేషెంట్: ''డాక్టరు గారూ. నాకు చెడువార్తనే ముందుగా చెప్పండి''

డాక్టర్: ''నీ కాళ్ళు తీసేయాల్సి వస్తుంది.''

పేషెంట్: ''ఇప్పుడు శుభవార్తని వినిపించండి''

డాక్టర్: ''పక్క రూములో పేషెంట్ నీ చెప్పుల్ని కొనుక్కోవాలనుకుంటున్నాడు''

- స్వాతి




''నాకు అసలు టైం లేదాంటి. స్కూల్ నుంచి వచ్చాక, ట్యూషన్, వీణ క్లాసు. ఇంటికెళ్ళాక స్కూల్ హోంవర్క్. ఇంకెపుడు ఆడుకోను'' నిరాశగా చెప్పింది.

''మా ఫ్లాట్స్ పిల్లలంతా ఎంచక్కా ఎన్నో రకాల గేమ్స్ ఆడతారు. నాకేమో ఎపుడూ చదువులు, ట్యూషన్‌లు. చిన్నప్పుడు కాకపోతే ఇంకెపుడు పరిగెట్టే ఆటలు ఆడను?'' నిలదీసినట్టుగా అడిగింది రూప.

తన మధురమైన బాల్యాన్ని అనుభవించటంలేదన్న బాధ ఉంది ఆ పసి మనసులో.

తనకి నచ్చని దారిలో నడవాలంటే, ఆ చిన్నారి మనస్సు ఎదురు తిరుగుతోంది.

ప్రేమ, అనురాగాలకు నిలయమవ్వాల్సిన ఆ చిన్ని గుండెల్లో కసి, ద్వేషం చోటుచేసుకుంటున్నాయి.

''మరి ఈ విషయం మమ్మీ, డాడీకి చెప్పలేదా? నీ ఇంట్రస్ట్ ఏంటో క్లియర్‌గా చెప్తే కదా, వాళ్ళకి తెలుస్తుంది'' అంది గాయత్రి.

''నేనేం చెప్పినా వాళ్ళు వినరాంటీ. నన్నసలు మాట్లాడనివ్వరు. మా డాడీ కూడా ఎప్పుడూ మమ్మీని తిడుతుంటారు. అందుకే మా డాడీ అంటే నాకిష్టంలేదు'' నిక్కచ్చిగా చెప్పింది రూప.

''అవును. నాకూ ఇష్టంలేదు'' వంత పాడింది చెల్లెలు దీప.

''తప్పు. అలా అనకూడదు. డాడీ, మమ్మీ అంటే గాడ్‌తో సమానం'' అనునయంగా అంది గాయత్రి.

''ఏం కాదు. గాడ్ అయితే పిల్లల్ని ప్రేమగా చూస్తాడు. అందుకే పెద్దయ్యాక నాకు పిల్లలు పుట్టినా, మీకు డాడీ లేడని చెప్పేస్తాను'' అమాయకంగా చెప్పింది పదేళ్ళ రూప.

గాయత్రికి నవ్వొచ్చింది. అపుడే వచ్చి చెట్టు చాటుగా నించుని వీళ్ళ మాటలు వింటున్న రేణుకకూ నవ్వొచ్చింది.

పదేళ్ళు కూడా నిండని ఆ చిన్నారి మనస్సులో మగాడిపట్ల ఎంత ఏహ్యాభావం చోటు చేసుకుంది.

ఇంత చిన్న వయస్సులోనే ఓ అభిప్రాయం స్థిరంగా ఏర్పడితే, అది పెరిగి, పెద్దయ్యాక, ఆ పిల్ల పెళ్ళిపట్ల విముఖత చూపించచ్చు. గాయత్రికి ఒక క్షణం ఏం చెప్పాలో అర్థంకాలేదు.

''సరే అయితే, నువ్వు వీణ క్లాసుకి ఎవ్విరి మన్‌డే టూ అవర్స్ రా. ఓకే'' నవ్వుతూ అంది గాయత్రి.

రూపకి ఎంతో సంతోషం అనిపించింది. నమ్మలేనట్లుగా గాయత్రివేపు చూసింది.

''థ్యాంక్యూ టీచర్, థాంక్యూ వెరీమచ్'' అంటూ టీచర్ చేతులు గట్టిగా ఊపేస్తూ చెప్పింది.

''ఇద్దరూ వెళ్ళి ఫ్రిజ్‌లో ఐస్‌క్రీమ్స్ కప్స్ ఉన్నాయి. తెచ్చుకుని, ఎంచక్కా ఉయ్యాల ఊగుతూ తినండి'' అంది గాయత్రి.

మాట అనడమే తడవుగా, ఇద్దరూ తూనీగల్లా ఇంట్లోకి పరుగుతీసారు. ఐస్‌క్రీమ్స్ తింటూ ఉయ్యాలాటలో మునిగిపోయారు.

నిశ్శబ్దంగా ఉన్న ఆ ప్రాంతం ఇప్పుడు, కేరింతలతే, నవ్వులతో నిండిపోయింది. గొడవలన్నీ మరిచి ఆ అక్క, చెల్లెళ్ళు ఎంతో ఆనందంగా హాయిగా ఆడుకుంటున్నారు.

• • •

రూప మాటలు చాటుగా విన్న రేణుక ఒక దోషిలా గాయత్రి ఎదురుగా కుర్చీలో కూర్చుంది. ఆమెకి ఏం మాట్లాడాలో తెలియటంలేదు.

''విన్నారుగా రేణుక, పిల్లల మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. వాళ్ళకి నచ్చనివి ఏం జరిగినా, తట్టుకునే శక్తి లేక, కలవరానికి లోనవుతారు. మన ఇష్టా, ఇష్టాలు, బరువు బాధ్యతలు పిల్లలపై రుద్దడం న్యాయంకాదు. మనం హార్షగా ఉంటే, వాళ్ళు చాలా డీప్‌గా హర్ట్ అవుతారు. మీరే ఆలోచించండి.''

''ఇందులో ఆలోచించడానికి ఏం ఉంది? ఉద్యోగం చేసి అలసి వచ్చి, భర్త సాధింపు, పిల్లల వేధింపులతో నాకూ విసుగొస్తుంది. దాంతో అపుడపుడు పిల్లలు బలి పశువులు అవుతుంటారు'' నిస్సహాయంగా అంది రేణుక.

''పెద్దవాళ్ళం, మనమే కంట్రోల్ చేసుకోలేకపోతే, పిల్లలు, వాళ్ళకి తగిలేగాయాల్ని ఎలా ఎదుర్కోగలరు. ఇంకో విషయం, పిల్లల్లో ఎప్పుడూ వ్యత్యాసం చూపకూడదు. అలా చేస్తే వారిలో ఒక్కొక్కసారి నేరప్రవృత్తి చోటు చేసుకుంటుంది.''

''అవుననుకోండి. కానీ ఆ సమయంలో ఏం తట్టదు. చిన్నపిల్ల ఏడుస్తూ, కంప్లైంట్ చేసేసరికి, రియాక్ట్ అవటం జరుగుతుంది.''

''మీరు ఇద్దరినీ సమానంగా చూడాలి. అక్క మాటలు వినాలి అని చిన్నదానికి చెప్పాలి. లేకపోతే ఆ పిల్లకి అదే అలవాటు అయి, పెద్దయ్యాక కూడా ఇతరుల గురించి నేరాలు చెప్పడం నేర్చుకుంటుంది.''

రేణుక, మౌనంగా ఉండిపోయింది. మళ్ళీ గాయత్రే చెప్పింది.

''మీ భార్యాభర్తలు కూడా విబేధాలు వస్తే, పిల్లల ఎదురుగా వాదానికి దిగకుండా ఉండాలి. అలాగే పిల్లలు కష్టపడి చదివినా, ఇతరులతో కంపేర్ చేసి, వారిని డిస్కరేజ్ చేయకూడదు. వాళ్ళకు నచ్చిన ఆటలు ఆడుకునే స్వతంత్రం వాళ్ళకివ్వాలి. వాళ్ళకీ ఏవో చిన్న చిన్న ఆశలుంటాయి. అవి తీరినపుడే వాళ్ళకి తృప్తి అనేది కలుగుతుంది. మమ్మీ, డాడీకి తమ పట్ల ప్రేమ ఉండబట్టే, తమ ఆశలు, కోర్కెలు తీరుస్తున్నారని భావిస్తారు. ఇవన్నీ మీకు తెలీని విషయాలు కావనుకోండి. అయినా కొంతవరకైనా ఆచరిస్తే మీకూ మనశ్శాంతి ఉంటుంది'' చెప్పింది గాయత్రి.

''తప్పకుండా గాయత్రి. మీరు చెప్పినట్లు ప్రవర్తించడానికే ప్రయత్నిస్తాను.'' పిల్లలు ఇద్దరినీ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటూ అంది రేణుక.

★